## క్లుప్తంగా

### రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం కల్చరల్: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ డే పురస్కరించుకొని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రక్తం కొరతపై కలెక్టర్ పిలుపు మేరకు అన్ని కళాశాలల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతోమంది ప్రాణాలు కాపాడడంలో భాగమవుతున్నారని కొనియాడారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డీఎంహెచ్‌వో అనితలు మాట్లాడుతూ రక్తదానం కోసం కళాశాల యాజమాన్యం సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎస్.హరిమానస, పి.పైడిరాజు, ఏపీవో డి.జగన్నాథం, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగురాలిని ఢీకొన్న కారు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలో కారు ఢీకొనడంతో వృద్ధ దివ్యాంగురాలికి తీవ్ర గాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మెట్ట సుధాకర్ తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిమ్మన్న ఆస్పత్రి సమీపంలో నివాసముంటున్న పట్నాని జాని (64) నిత్యం పందుంబుళ్ల కూడలి, ఖజానా జ్యూయలర్స్ పరిసరాల్లో వర్తకులు ఇచ్చే ఆహార పదార్థాలు తింటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి డే అండ్ నైట్ నుంచి అతివేగంగా వచ్చిన కారు జానీని ఢీకొట్టడంతో కుడిచేతి భుజం విరిగింది. నడుము, కాళ్లకు కూడా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

### వడ్డి వైకుంఠంకు సతీ వియోగం



వడ్డి కృష్ణవేణి (ఫైల్)

అరసవల్లి: అరసవల్లి కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు, సామాజికవేత్త వడ్డి వైకుంఠం భార్య వడ్డి కృష్ణవేణి (61) బుధవారం ఉదయం మృతి చెందారు. ఆకస్మికంగా జరిగిన ఈ ఘటనతో జిల్లా నలుమూలల నుంచి కుల సంఘాల సభ్యులతో పాటు స్థానికులు భారీగా తరలివచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆమె చివరి కోరిక మేరకు ఆమె భౌతికకాయాన్ని నేరుగా కాశీ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. అక్కడే అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేయించుకుని పయనమయ్యారు.

### మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ




మొక్కను నాటి నీరు పోస్తున్న డీన్ జోగినాయుడు

శ్రీకాకుళం రూరల్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.జోగినాయుడు అన్నారు. మండలంలోని నైర వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవం సందర్భంగా బుధవారం స్వచ్ఛ భారత్ నిర్వహించి, మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా సంగిడి పోటీలు



సంగిడి పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ గ్రామదేవత కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం జిల్లాస్థాయి సంగిడి పోటీలు నిర్వహించారు. స్థానిక రామ మందిరం వద్ద జరిగిన ఈ పోటీల్లో 150 కేజీలు, 97 కేజీలు, 95 కేజీల తీత సంగిడి పోటీల్లో క్రీడాకారులు పోటీపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ప్రథమ చికిత్సపై శిక్షణ తరగతులు

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణా తరగతులు, 8 రోజుల సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కానున్నాయని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శిక్షణ పూర్తిచేసి సర్టిఫికెట్ పొందిన వారికి వైద్యారోగ్యశాఖ, ప్రైవేటు ఆస్పత్రులు, పరిశ్రమలు, కర్మాగారాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. శిక్షణ పొందాలనుకునేవారు నేరుగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, మరిన్ని వివరాల కోసం 94404 90525 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# యమ కంకరులు..!



గ్రావెల్ తవ్వకాలు జరిపిన సంచాం కొండ

- కొండలను తొలచి.. గ్రావెల్ దోచేస్తున్న వైనం
- రూ.కోట్లు కొల్లగొడుతున్న నాయకులు
- పట్టించుకోని అధికారులు

రణస్థలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి అడ్డగోలు గ్రావెల్(కంకర) దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. నియోజకవర్గంలోని లావేరు, రణస్థలంలో నిత్యం గ్రావెల్ గొడవలే వినిపిస్తున్నాయి. పైస్థాయి ప్రజాప్రతినిధుల నుంచి కిందస్థాయి కార్యకర్తల వరకు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఇటీవల ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఏమూల చూసినా గ్రావెల్ కొండలను పిండేస్తున్న ఘనులే కనిపిస్తుండడంతో ప్రజలు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎన్నికల్లో శపథం చేసిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత అభివృద్ధిని కాంక్షిస్తూ పరిపాలన సాగిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రకృతి వనరులను కొల్లగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**తాజాగా బయటపడ్డ గ్రావెల్ అక్రమ తవ్వకాలు**

లావేరు మండలంలోని కొండకుంకాం గ్రామంలో గ్రావెల్ కొండకు గుండు కొట్టేశారు. అలాగే అదే మండలంలోని తామాడ కొండలో వేలాది కంకర లోడ్లు అనాధికారికంగా తరలించుకుపోయి కొండను కరిగించేశారు. రణస్థలం మండలంలోని సంచాం పరిధిలో ఉన్న అర్జునవలస కొండ, కొండ ములగాం పరిధిలో ఉన్న ముక్తుంపురం కొండ, నారువ పరిధిలోని అక్కయ్యపాలెం కొండలను పూర్తిగా తొలి చేశారు. వీటన్నిటికీ ఎటువంటి అనుమతులు లేకపోయినా లక్షల క్యూబిక్ మీటర్లు కొల్లగొట్టి లే-అవుట్లు ఇతర అవసరాలకు వినియోగించారు. ఇలా గత ఎడాదిన్నరగా కొండలను పిండి చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయారు.



తవ్వకాలతో దారుణంగా తయారైన ముక్తుంపురం కొండ

**వనరులను కొల్లగొడుతున్నారు**

ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారు. వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు ఎదురవుతాయి. వనరులను విధ్వంసం చేస్తున్న చోట నిరసన గళం విప్పి వనరులను కాపాడే చర్యలు చేపడతాం.

– పిన్నింటి సత్యం నాయుడు, జే.ఆర్.పురం గ్రామస్తుడు

**ప్రభుత్వం చర్యలు చేపట్టాలి**

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఏ మూల చూసినా నిత్యం గ్రావెల్ న్యూసే కనిపిస్తోంది. అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్‌ను నిలువరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అధికారులు ఉదాసీనత పాటిస్తే వనరులు కరిగిపోయి పర్యావరణం దెబ్బతింటుంది.

– గొర్లె శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, రణస్థలం

## ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం



ఎచ్చెర్ల: మొక్కలు నాటుతున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్‌ఎస్‌ఎస్ ఫౌండేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డా.ఎం.సుధాకర్ తొలుత గ్రంథాలయం ఆవరణలో మొక్కలను నాటి అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు గత ఎనిమిదేళ్లుగా ట్రిపుల్ ఐటీ చేపట్టిన మెడికల్ బ్లడ్ క్యాంపులు, ప్రజల్లో చైతన్యం కలిగించిన కార్యక్రమాలను వివరించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుంచి సేవా భావం అలవర్చుకోవాలని సూచించారు. ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లుకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, ప్రొఫెసర్ సుధాకర్, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డా.గేదెల రవి, ప్రోగ్రాం అధికారులు డా.వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, పి.గాయిత్రీ, డా.పి.ప్రశాంత్‌కుమార్, టి.అసిరినాయుడు, ఆర్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ నిమజ్జనం



నిమజ్జన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ నిమజ్జనాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బంగారు, వెండి వర్తక సంఘం అధ్యక్షుడు లంక గాంధీనాయుడు, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సోపింటి తారకేశ్వరరావు, కార్యదర్శి కదారి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కలిశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ చార్జీలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులకు రూ.10 వేల కనీస వేతనం ఇవ్వాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని యూటీఎఫ్ భవనంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి, ఆశ వర్కర్స్ యూనియన్ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయుకురాలు చందు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

మహాసభలో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్షురాలిగా కె.సుశీల, ప్రధాన కార్యదర్శిగా బి.ఉత్తర, కోశాధికారిగా ఆర్.రాధ, ఉపాధ్యక్షులుగా టి.సీతమ్మ, వి.లక్ష్మి, కె.కౌసల్య, కార్యదర్శులుగా టి.ప్రవీణ, పి.భూదేవి, వై.లక్ష్మిలను ఎన్నుకున్నారు.

### సకాలంలో వైద్య సేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

శ్రీకాకుళం రూరల్: సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత సూచించారు. మండలంలోని సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో మందుల కొరత ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### విధి నిర్వహణలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న నోడల్ అధికారి అరుంధతి దేవి

జి.సిగడాం: గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు అలసత్వం వహించవద్దని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి జి.అరుంధతిదేవి స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామిత్వ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# వాన.. హైరానా..!

- జలమయమైన నగరం
- ఎడతెరపిలేకుండా కురిసిన వర్షం



ఆదివారంపేట వద్ద జలమయమైన రోడ్డు



నీటమునిగిన బావాజీనగర్ రోడ్డు



హుడ్కోకాలనీకి నీరు చేరిన దృశ్యం



జలమయమైన రిమ్స్ హాస్పిటల్ రోడ్డు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతో నగరమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అరగంటలో నగరమంతా జలమయమవ్వడంతో నగర ప్రజలు అవస్థలు పడ్డారు. జిల్లా పరిషత్ రోడ్డు, ఇల్లిసిపురం రోడ్డు, రైతుబజారు జంక్షన్, హాస్పిటల్ రోడ్డు, భారతీనగర్, హుడ్కోకాలనీ, డీసీసీబీ కాలనీ, సరస్వతీ మహల్ కూడలి, రైతు బజార్ కూడలి, కృష్ణాపార్కు రోడ్డు, పొట్టి శ్రీరాములు కూడలి, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్డు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డులో ప్రయాణం నరకప్రాయమైంది.

**చినుకు పడితే చెరువే...**



చిన్న వర్షం పడితే చాలు కాలనీ అంతా చెరువులా తయారవుతుంది. హుడ్కో కాలనీలో కాలువలన్నీ నిత్యం శుభ్రం చేయడంతో పాటు కాలువలు ఎత్తుచేస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. ప్రధాన కాలువల్లో సైతం పూడికలు ఎప్పటికప్పుడు తీస్తే బాగుంటుంది.

– ఎ.రామ్మోహన్‌రావు, హుడ్కోకాలనీ, శ్రీకాకుళం

**శాశ్వత పరిష్కారం చూపండి**



శ్రీకాకుళం నగరానికి చాలా కాలంగా వెంటాడుతున్న సమస్య రోడ్లన్నీ జలగ్బంధమైపోవడం. వర్షం పడితే చాలు నగరంలో చాలా ప్రాంతాలు నీటమునిగిపోతున్నాయి. ప్రధానంగా అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో, ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా, కృష్ణాపార్కు, కిన్నెర థియేటర్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి, గుజరాతీపేట, పాలిటెక్నిక్ రోడ్డు, పీఎన్‌కాలనీల్లో కొన్ని రోడ్లతో పాటు పలు ప్రాంతాలు నీటమునిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.

– బలగ ధర్మారావు, ఆదివారంపేట, శ్రీకాకుళం

## వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు





తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్రం కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల రామారావు (లక్ష్మణరావు)లు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ మరింత బలోపేతమవ్వడంపై చర్చించారు. వీరితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

– రణస్థలం/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)

## వైఎస్సార్‌సీపీలో నియామకాలు

రణస్థలం: మండలంలోని వైఎస్సార్‌సీపీ గ్రామ పంచాయతీ పార్టీ కమిటీ అధ్యక్షులను పార్టీ ఆదేశాల మేరకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం నియమించారు. దీనిలో భాగంగా అల్లివలస – మైలపల్లి వెంకటేష్, అర్జునవలస – మీసాల రామునాయుడు, బంటుపల్లి – పాసపు ముకుందరావు, చిల్లపేటరాజాం – కంబపు నరసింహులు రెడ్డి, దేరసాం – దన్నాన రామకృష్ణ, జేఆర్‌పురం – దన్నాన సీతారాం, జీరుపాలెం – మాగుపల్లి రాముడు, కమ్మసిగడాం – సింక గౌరి, కొండములగాం – గొర్లె అప్పలనాయుడు, కోష్ట – పిసిని లక్ష్మణరావు, కోటపాలెం – గొర్లె జగదీశ్వరరావు, కొచ్చెర్ల – బస్వ దురుగుబాబు, కొవ్వాడ మత్స్యలేశం – అల్లిపల్లి అప్పన్న, కృష్ణాపురం – కంబపు రామిరెడ్డి, మహంతిపాలెం – గొర్లె అప్పలనర్సునాయుడు, మరువాడ – జక్కంపూడి అచ్చిరాజు, ఎన్‌జీఆర్‌పురం – మైలపల్లి పిల్లతాత, నారువ – పాల ముసలయ్య, మెంటాడ – బాకి సూర్యనారాయణరెడ్డి, పాతర్లపల్లి –గొర్లె రాధాకృష్ణ, పిసిని – రెడ్డి విశ్వేశ్వరరావు, పైడిభీమవరం – లంకలపల్లి ప్రసాదరావు, రణస్థలం – మజ్జి రమేష్, రావాడ – గొర్లె శ్రీనివాసరావు, సంచాం – రెడ్డి రాము నాయుడు, తిరుపతిపాలెం – మండల రవి, వీఎన్‌పురం – రెడ్డి చిన్నప్పలనాయుడు, వల్లభరావుపేట – గురాన తిరుమల మానస, వెంకటరావుపేట – కొత్తకోట్ల లక్ష్మునాయుడు, తెప్పలవలస – యాగాటి అప్పయ్య, వెల్బురాయి – కెల్ల రామకృష్ణ, దేవరాపల్లి – మీసాల శ్రీనివాసరావు, నెలివాడ – పతివాడ శ్రీరామ్‌మూర్తిలను నియమించారు.

## రోగాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ

జి.సిగడాం: రోగాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రతిజ్ఞ శర్మ సూచించారు. మండలంలోని పెనసాం గ్రామంలో ప్రజలకు వ్యాధులపై బుధవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో అజయ్ చంద్ర, హెచ్‌వీ సుగుణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు యు.శిరీష, కె.సౌజన్య, ఎస్.అనూష, ఎన్.కమల, అప్పలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వక్తలు పేర్కొన్నారు. హర్షవల్లి లయన్స్ శ్రీకాకుళం నగర కార్పొరేషన్ మరియు లయన్స్ ఇంటర్నేషనల్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని విజయగణపతి ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని బుధవారం నిర్ణయించారు. లయన్ ఇంటర్నేషనల్ పర్యావరణ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ డీవీడీ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ శ్రీధర్, లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, సెక్రటరీ టిక్కం రాంగోపాల్, ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, సభ్యులు చౌదరి శ్రీనివాస్, డాక్టర్ బగాది శ్రావ్య, హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు మణిశర్మ, సుమన్, గోపి, ఎం.మాధవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

### క్విజ్ పోటీలకు ఆహ్వానం



వివరాలు వెల్లడిస్తున్న వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ: వికసిత్ భారత్‌లో భాగంగా క్విజ్ పోటీల నమోదుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. బుధవారం ఆయన ఎన్‌వైకే కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు టెన్త్‌క్లాస్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విదార్థులతో పాటు 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఈనెల 8 నుంచి మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ అక్టోబర్ 31వ తేదీ వరకు ఉంటుందన్నారు.

## • జగజ్జనని.. శుభప్రదాయని



ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలో ప్రత్యేక పూజలందుకుంటున్న అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: రాజరాజేశ్వరి మాతకు పూలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: బలగలో సామూహిక పారాయణలు చేస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: పెద్దపాడులో భవానీ భక్తుల పూజలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన బుధవారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్